ప్రజాశక్తి
బుధవారం 1 అక్టోబర్ 2025
5
అల్లూరి సీతారామరాజు

2న మాంసం విక్రయాలు నిషేధం

వ్యాపారులకు నోటీసులిస్తున్న చింతపల్లి కార్యదర్శి

ప్రజాశక్తి-చింతపల్లి : మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మాంసం విక్రయాలు చేయొద్దని చింతపల్లి పంచాయతీ కార్యదర్శి లక్ష్మీ కుమార్ పర్యవేక్షణలో పంచాయతీ సిబ్బంది మాంసం దుకాణ యజమానులకు మంగళవారం ముందస్తు నోటీసులు అందజేశారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది మంజేటి శ్రీనివాస్, పిండి అనిల్ కుమార్ పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి వరద

గోదావరి మరోమారు ఉగ్రరూపం దాల్చింది. మూడో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరువగా ఉన్న వరదతో పలు గ్రామాలు ఇప్పటికే నీట మునిగాయి. వందల ఎకరాల్లో వరి, మిర్చి పంటలు ముంపునకు గురయ్యాయి. చాలా పెట్టుబడులు పెట్టామని అంతా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. నిర్వాసితులు గుట్టలపై ఉండలేక, కిందకు రాలేక నానా అవస్థలు పడుతున్నారు. కొన్ని గ్రామాలకు చుట్టూ నీరు చేరిపోవడంతో బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

- రెండో ప్రమాద హెచ్చరిక దాటిన ప్రవాహం
- మరింత పెరగొచ్చని అధికారుల సూచన
- అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- బిక్కుబిక్కుమంటున్న నిర్వాసితులు
- నీట మునిగిన పలు గ్రామాలు, పంటలు
- నిలిచిన రాకపోకలు

విఆర్‌పురం: వడ్డిగూడెం గ్రామం చుట్టూ చేరిన వరద నీరు

కూనవరం: ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ప్రజాశక్తి -ఎటపాక: గోదావరి మరోమారు ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక (48 అడుగులను) దాటి ప్రవహిస్తోంది. మంగళవారం సాయంత్రానికి 50 అడుగుల వద్ద వరద ప్రవహిస్తుంది. మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలియజేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. వరద పెరగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నెల్లిపాక – వీరాయిగూడెం, కన్నాయిగూడెం– గట్టుగూడెం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మురుమూరు, నందిగామ, చలంపాలం, బండారుగూడెం, ఎర్రగట్టు గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. మురుమూరు, నందిగామ, గౌరీదేవిపేట, తోటపల్లి, నెల్లిపాక గ్రామాల్లో వందల ఎకరాల్లో మిర్చి తోటలు పూర్తిగా నీట మునిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఇప్పటికే ఒక్కో ఎకరాకు 25వేలు ఖర్చు చేశామని రైతులు తెలిపారు. భూములు పోలవరం భూసేకరణకు ఇవ్వడం వలన ఈ క్రాప్ లేక, బ్యాంకులోన్ , ప్రభుత్వ సబ్సిడీలు రావడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

విఆర్‌పురం: వరదతో విలీన మండలాలు విఆర్ పురం బీతిల్లుతున్నాయి. ఈ ఏడాది ఐదోసారి వరదలు సంభవించడం జరిగింది. శ్రీరామగిరి, వడ్డిగూడెం, రామవరం, చింతరేగుపల్లి ప్రధాన రహదారులపై వరద నీరు చేరడంతో బస్సుల రాకపోకలు నిలిపివేశారు. దీంతో భద్రాచలం వెళ్లే ఆర్టీసీ బస్సులు మూడు రోజులుగా నిలిచిపో యాయి. ఇక వందలాది ఎకరాల్లో వేసిన పంటలు, నారుమళ్లు మునిగి పోయాయి. పంట వేయని పొలాలు నీట మునిగి ఉన్నాయి. పంటలు వేసే తరుణంలో ఈ వరదలు సంభవించడం పట్ల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి వేల రూపాయలు రైతులు ఖర్చు చేయడం జరిగింది. ఇది ఇలా ఉండగా గోదావరి ఇంకా పెరుగుతూనే ఉంది. గోదావరి పరీవాహక ప్రాంతాలలో గోదావరి నీటిమట్టం పెరుగుతూనే ఉందని సమాచారం. మండలంలో ఈ సీజన్లో ముమ్మరంగా వ్యవసాయ ఇతర పనులు చేసుకుని జీవించాల్సిన వ్యవసాయ కార్మికులు వారం రోజులుగా పనులు లేక అవస్థలు ఎదుర్కొంటున్నారు. చుట్టూ వరద ఉండడంతో ఎటువెళ్లి పనులు చేద్దామన్నా దారిలేక పనులు చేసే చోట పొలాలు నీట మునిగి పేదలు ఇబ్బందులు పడుతున్నారు. వరుసగా ఆరోసారి ఈ ఏడాది వరదలు రావడంతో వ్యవసాయ పనులు పూర్తిగాక రైతులు సీజనల్ పనులు దొరక్క ఇటు కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి పరిస్థితి ఎప్పుడూ రాలేదని ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి అందుకోవాలని కోరుతున్నారు.

నెల్లిపాక రోడ్డుపై నిలిచిన వరదనీరు

కూనవరం : గోదావరి వరద పెరుగుతూ విలీన మండలాలను దారుణంగా దెబ్బతీస్తోంది. జూన్ నుండి మొదలై ఇప్పటికి 5 సార్లు విలీన మండల గ్రామాలను అటు ఆర్థికంగా ఇటు వ్యవసాయపరంగా దెబ్బతీస్తోంది. మండలంలో ఈ ఏడాది మొన్నటివరకూ అదును రాక మిర్చి నారు ఎండిపోయింది. వారం రోజుల క్రితం అదును ఇవ్వడంతో ఒక్కసారిగా రైతులు మిరప నాట్లు వేశారు. ఒక్కసారిగా గోదావరి వరద రావడంతో మిరప నీటమునిగి రైతుకి కన్నీరే మిగిల్చింది.

వరద బాధిత కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

కూనవరం మండలంలో ముంపు పొలాలను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

కూనవరం: మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం నాయకులు, ప్రజా ప్రతినిధులు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపునకు గురైన వరికి ఎకరాకు 50 వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు పంచాయతీల్లో కూటురు, ముల్లూరు, భగవాన్‌పురం, రేపాక, పెద్దార్కూర్ గ్రామస్తులు పరిహారం చెల్లించాలని ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, జిల్లా కమిటీ నాయకులు పాయం సీతారామయ్య, సర్పంచ్ మడకం నాగమణి మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి నెలకు రూ.25వేల చొప్పున ప్రభుత్వం చెల్లించాలని అలాగే మిర్చి పంట కు ఎకరాకు 50 వేలు ఇవ్వాలన్నారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు తెల్లం తమ్మయ్య, ఎంపిటిసి దర్ముల అమ్మాజీ సర్పంచ్ బొగ్గా వెంకమ్మ, కార్యదర్శులు నూపరాజు, పైదా రాముడు, సోడే శ్రీరాములు పాల్గొన్నారు.

8 ఎకరాల్లో పంట మునిగింది

మాది మాది గొమ్ముఅయ్యవారిగూడెం గ్రామం. నేను 8 ఎకరాల్లో మిర్చి సాగుచేశాను. వేసిన మూడు రోజులకే వరద వచ్చి మిరప పైరు నీట మునిగింది. ఈ ఏడాది ప్రతికూల వాతావరణం వల్ల నారు వేయడం ఆలస్యం అయ్యింది. ఇప్పుడు వరదకు నీట మునిగింది. ఇప్పటికి 2 లక్షల 50 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఇప్పడు మళ్లీ వేసినా దిగుబడి వస్తుందని నమ్మకం లేదు. ఈ బాధలు పడలేం. ప్రభుత్వం ప్యాకేజి ఇవ్వాలి.

– కర్నాటి శ్రీనివాసరావు, రైతు, గొమ్ముఅయ్యవారిగూడెం

గంజాయి జోలికి పోవొద్దు

డిఎస్‌పి షాబాద్ అహ్మద్

అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి షాబాద్ అహ్మద్

ప్రజాశక్తి -దుంబ్రిగుడ : గిరి యువత గంజాయి జోలికి వెళ్లి తమ భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని పాడేరు డిఎస్‌పి షాబాద్ అహ్మద్ హితవు పలికారు. మంగళవారం మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగి మోడల్ కాలనీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి వల్ల కలిగే నష్టాలు, అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ గంజాయి సాగు, రవాణా, విక్రయం, తాగడం ఏదైనా చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. స్మగ్లర్ల ప్రలోభాలకు లొంగి, లేకుంటే తాత్కాలిక ఆర్థిక ప్రయోజనాలకు ఆశపడి, . అనేకమంది గంజాయి సాగు చేస్తూ, మరి కొంతమంది రవాణా చేస్తూ, ఇంకొంతమంది గంజాయి మత్తుకు బానిసై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. గంజాయి అనర్థాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి, దాన్ని దూరంగా పెట్టాలని, ప్రభుత్వపరంగా ఇస్తున్న పథకాలు, ప్రత్యామ్నాయ పంటలకు అందిస్తున్న ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక ఎస్ఐ పాపి నాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు 3,500 మొక్కల పంపిణీ

గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న విశాఖ పోర్టు అథారిటీ, నవనిర్మాణ్ ప్రతినిధులు

ప్రజాశక్తి-చింతపల్లి : విశాఖపట్నం పోర్ట్ అథారిటీ, విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి సంయుక్త ఆధ్వర్యంలో చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ పరిధిలోని వాముగడ్డ, చీకటి మామిడి, పిన్నకొత్తూరు గ్రామాల్లో మంగళవారం రైతులకు ఉచితంగా 3,500 మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హార్టికల్చర్ జిఎండి రాధిక మాట్లాడుతూ మామిడి, చింత, బాదం, నేరేడు, సీతాఫలం, సపోటా వంటి వాణిజ్యపరమైన మొక్కలు అందజేస్తున్నామని, ఇవి భవిష్యత్తులో రైతులకు మంచి ఆదాయం తీసుకువస్తాయని తెలిపారు. నవనిర్మాణ సమితి సీనియర్ మేనేజర్ కుమార్ మాట్లాడుతూ రైతులు ఈ మొక్కలతో పాటు కాఫీ, మిరియాలను కూడా సాగు చేయాలని సూచించారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి మాట్లాడుతూ వేసవికాలంలో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తగా పెంచుకోవాలని రైతులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు వంతల సుబ్బారావు మాట్లాడుతూ గతంలో పంపిణీ చేసిన మొక్కలు బాగా పెరిగాయని, రైతులు మరింత ఉత్సాహంతో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం పోర్ట్ అథారిటీ సీనియర్ వివో సాంబమూర్తి, హార్టికల్చర్ అధికారి భాస్కర్, సుధీర్, గ్రామస్తులు జి. లక్ష్మయ్య, జి. పాపారావు, ఎం. రాజారావు, కొర్ర రాజబాబు తదితరులు పాల్గొన్నరు.

గ్రాప్లింగ్ రెజ్లింగ్ విజేతగా జీవన్ కుమార్

జీవన్ కుమార్‌ను అభినందిస్తున్న పోలీసు అధికారి, తదితరులు

ప్రజాశక్తి-చింతపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రాప్లింగ్ రెజ్లింగ్ చాంపియన్ షిప్–2025లో చింతపల్లి యువకుడు జర్సింగి జీవన్ కుమార్ విజేతగా నిలిచాడు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం మహాత్మా గాంధీ పాఠశాల ప్రాంగణంలో సెప్టెంబర్ 27, 28 తేదీలలో జరిగిన ఈ పోటీలలో జూనియర్ విభాగం 66 కేజీల కేటగిరీలో రాష్ట్రస్థాయి మొదటి స్థానం సాధించి హిందూపురం డిఎస్‌పి చేతుల మీదుగా ట్రోఫీ, ధ్రువపత్రం అందుకున్నాడు. జీవన్ కుమార్ ప్రస్తుతం చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం డిఎ హిస్టరీ విభాగంలో చదువుతున్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయి విజేతగా నిలిచిన జీవన్ కుమార్‌కి పాఠశాల అధ్యాపకులు, సహ విద్యార్థులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలిపారు. జీవన్ కుమార్ తండ్రి జర్సింగి విశ్వనాథం చింతపల్లి పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్నారు.

కొట్టుకుపోయిన గంగవరం వంతెన

మన్యంలో భారీ వర్షం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం ధారకొండ పంచాయతీ పరిధి దారకొండ, గంగవరం పరిసర ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి భారీ వర్షం కురిసింది. ధారకొండలో ప్రధాన మార్కెట్ రోడ్‌లో వర్షపు నీరు ఉప్పొంగి ప్రవహించడంతో వ్యాపారులు స్థానికులు తీవ్ర భయభ్రాంతులకు గురయ్యారు. సుమారు ఐదు గంటలపాటు వర్షం ఎడతెరిపి లేకుండా కురవడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అయ్యాయి. ధారకొండ పంచాయతీ పరిధిలో తాత్కాలికంగా నిర్మించిన గంగవరం వంతెన కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు బంద్ అయిపోయాయి. అగ్రహారం వంతెనకు కూడా గతంలో పడిన గండి పూడ్చలేదు. దానిపై నుంచి నీరు ప్రవహిస్తోంది. దీంతో రాకపోకలు బంద్ అయ్యాయి. శాశ్వతంగా వంతెనలు నిర్మించాలని గిరిజన సంఘం అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు సిపిఐ మండల కార్యదర్శి కవర్ల భగవాన్, వార్డు మెంబర్ కుర్ర బలరాం డిమాండ్ చేశారు. వంతెనలు, రహదారులు నిర్మాణంపై ప్రజా ప్రతినిధులు అధికారులు స్పందించాలని భారతీయ ఆదివాసీ రాష్ట్ర అధ్యక్షులు గడుతూరు రామ్ గోపాల్ డిమాండ్ చేశారు. ప్రస్తుత తాజా పరిస్థితిపై ఐటిడిఎ పిఒ ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, టిడిపి జిల్లా ఇన్చార్జి గిడ్డి ఈశ్వరిదృష్టికి తీసుకెళ్లామన్నారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

చట్రాపల్లిలో వర్ష బీభత్సం

జికె వీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లిలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకూ ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో ప్రజలు కంటిమీద కునుకు లేకుండా కాలం వెళ్లదీశారు. గత ఏడాది సెప్టెంబర్ 9న కొండ చరియలు విరిగిపడ్డాయి. ఒక వ్యక్తి మృతి చెందగా 70 మేకలు వరదలో కొట్టుకుపోయాయి. పలుసార్లు అధికారులు పరిశీలించి మోడల్‌కాలనీ నిర్మిస్తామని చెప్పారు కానీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి వరద నీరు గ్రామంలోకి దూసుకొచ్చింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సురక్షితమైన ప్రదేశంలో ఇళ్లు నిర్మించి ఆదుకోవాలని కోరుతున్నారు.

చట్రాపల్లి గ్రామంలోకి కొండపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

రాకపోకల కష్టాలు పట్టవా.?

- కొట్టుకుపోయిన కల్వర్టుతో పివిటిజి గిరిజనం అవస్థలు
- పునర్నిర్మాణంలో నిర్లక్ష్యంపై సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

కొట్టుకుపోయిన కల్వర్టు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో పివిటిజల నిరసన

ప్రజాశక్తి ముంచింగిపుట్టు :మండలంలోని మారుమూల బుంగాపుట్టు గ్రామ పంచాయతీ బొర్ర మామిడి, చుట్టుగొంది గ్రామాలమధ్య ఉన్న కల్వర్టు సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ధ్వంసమై కొట్టుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. విషయం తెలుసుకున్న సిపిఎం మండల కమిటీ సభ్యుడు వంతాల నీలకంఠం, పార్టీనేతలు మంగళవారం కొట్టుకుపోయిన కల్వర్టును స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. శాశ్వత కల్వర్టు పునర్నిర్మాణంలో ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యాన్ని వ్యతిరేకంగా నినాదాలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యుడు వంతల నీలకంఠం మాట్లాడుతూ సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అప్పటికే అంతంతమాత్రంగా ఉన్న కల్వర్టు పూర్తిగా కొట్టుకుపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. గతేడాది వర్షాలకే ఈ కల్వర్టు వద్ద ఇరువైపులా రోడ్డుకు గండిపడి, కోతకు గురవ్వగా, అప్పట్లోనే శాశ్వత కల్వర్టు నిర్మించాలని స్థానిక గిరిజనులు అధికారులను వేడుకున్నారు. అయితే అధికారులు నిర్లక్ష్యంతో శాశ్వతకల్వర్టును పక్కనబెడితే, కనీసం పటిష్ట మరమ్మతులైనా చేపట్టకపోవడంతో, స్థానిక గిరిజనులే స్వచ్ఛందంగా ఇరువైపులా గండిపడిన ప్రాంతంలో మట్టితోపూడ్చి రాకపోకలకు వీలుగా చేశారన్నారు. తాజాగా కురిసిన వర్షాలకు మళ్లీ కొట్టుకు పోవడంతో రాకపోకల కష్టాలు మళ్లీ మొదటికే వచ్చాయని నీలకంఠం ఆవేదన వ్యక్తం చేశారు. బుంగాపుట్టు, లక్ష్మీపురం గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాల ప్రజలు ఎన్నోసార్లు అధికారులు దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా జిల్లాకలెక్టర్, ఐటిడిఎ పిఒ, ఇతర అధికారులు, నేతలు స్పందించి, పిఎం జన్‌మన్ పథకంలోనైనా ఈ కల్వర్టు, రహదారి పునర్నిర్మాణాలకు నిధులు మంజూరుచేసి, రెండు పంచాయతీల్లోని పివిజిటి గిరిజనులు రహదారి కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు. నిరసన కార్యక్రమంలో గ్రామస్తులు వి.తిరుపతి రావు, వి.బలరాం, వి.గౌతం, పి.గణపతి, పి.చేతన్ తదితరులు పాల్గొన్నారు

భారీ వర్షానికి కూలిన ఇల్లు

ప్రాణాపాయం తప్పడంతో ఊపిరిపీల్చుకున్న బాధితులు

కూలిన మట్టిగోడ కింద సామాన్లు వెతుకుతున్న బాధితుడు

ప్రజాశక్తి -ముంచింగిపుట్టు : మండలంలోని మారుమూల బుంగాపుట్టు గ్రామపంచాయతీ దుక్కుగూడ గ్రామంలో సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఇంటి మట్టిగోడతో సహా మొత్తం కూలిపోయింది. కొర్ర తులసిరాం అనే గిరిజనుడికి చెందిన ఆరుగురు కుటుంబ సభ్యులు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఒక్కసారిగా మట్టిగోడలతో ఉన్న ఇళ్లు కూలిపోయిందని బాధితుడు వాపోతున్నారు. అయితే ఇంటి లోపల పక్కకు కాకుండా బయటకు పడడంతో ఇంటిల్లిపాది ప్రాణాపాయం నుంచి బయటపడ్డామని తులసీరాం అంటున్నాడు. అయితే ఇంట్లోని ఆధార్, రేషన్‌కార్డులు, బ్యాంకు, పట్టాదారు పాసుపుస్తకాలతోపాటు పది బస్తాల ధాన్యం, రెండేసి బస్తాల రాగులు, సామలు, బియ్యం తడిచి పూర్తిగా పాడైపోయాయని బాధితుడు వాపోతున్నాడు. తమకు పిఎం జన్‌మన్‌లో ఇళ్ల మంజూరైనప్పటికీ, గృహనిర్మాణ శాఖ అధికారులు నిర్లక్ష్యం, సహకార లేమితో లింటల్ లెవెల్ వరకు పనులు చేపట్టినా, నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపేయక తప్పలేదని బాధితులు ఆవేదన చెందుతున్నాడు.దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ప్రమాదమని తెలిసినా మట్టిగోడల ఇంటిలో నివసిస్తున్నామని అంటున్నాడు. అధికారులు స్పందించి, తమ కుటుంబానికి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని, అలాగే పిఎం జన్‌మన్‌లో నిర్మిస్తున్న ఇంటికి బిల్లులు చెల్లించి సహకరించాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎస్.నంద్

ప్రజాశక్తి-పాడేరు: మండలంలోని రాములపుట్టు గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.నంద్, ప్రకృతి వ్యవసాయ అదనపు జిల్లా ప్రాజెక్టు అధికారి భాస్కర్ పాల్గొని, రైతులకు సాగు పద్ధతులపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రైతులు క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్న డిఆర్‌పి, ఎటిఎం, ఏ గ్రేడ్ మోడళ్లను అధికారులు సందర్శించి పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను కలుసుకొని, వారు అనుసరిస్తున్న పద్ధతులు, విధానాలు, వాటి ద్వారా పొందుతున్న ఆదాయ వివరాలను తెలుసుకున్నారు. తదుపరి బయో ఇన్‌పుట్ రిసోర్స్ సెంటర్ను సందర్శించారు ప్రకృతి విధానంలో సాగుచేస్తున్న రైతులను అభినందించిన అధికారులు, ఈ విధానంలో సాగును మరింత విస్తృతం చేసి, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS AT VIZIANAGARAM
ARBITRATION CLAIM PETITION NO.34/2025

BETWEEN:
M/S Shriram Chits (India) Pvt Ltd, Vizianagaram Branch-2, Rep by its Junior Manager. **.... DISPUTANT**
VERSUS
SUBSCRIBER
Katta Siva Prasad & others
GUARANTORs
OP4) Dandusena Gasi, S/o Rama Chandra, working as SGT, GTWA EM School, Lingaparthi, Ananthagiri(md), Alluri Sitha Rama Raju (dist).
. . . OPPONENT

NOTICE

పై నెంబరు దావా మీ నుండి దావా సొమ్ము మరియు ఖర్చులు రాబట్టుకొనే నిమిత్తం పై ఆర్బిట్రేటర్ వద్ద వాది దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు ఎటువంటి ఆక్షేపణలు ఉన్నచో తే 08-10-2025 ది ఉ॥ గం॥ 10.30 గం॥లకు పై కోర్టులో మీరు స్వయంగా గాని లేదా లాయరు ద్వారా గాని హాజరై మీ వాదన తెలియజేసుకోవలెను. లేని యెడల ఆర్బిట్రేటర్ వారు పైదావా మీ పరోక్షమున తీర్మానించడ మగునని యిందుమూలముగా తెలియజేయడమైనది.

డివిజినల్ మేనేజర్
శ్రీరామ్‌చిట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, విజయనగరం

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

శంకుస్థాపన చేస్తున్న జెడ్పిటిసి, సర్పంచ్

ప్రజాశక్తి- చింతపల్లి : చింతపల్లి గ్రామ రామాలయం వీధిలో సిసి రోడ్డు నిర్మాణం, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన మరమ్మతు పనులను జెడ్పిటీసీ పోతురాజు బాలయ్య సోమవారం స్థానిక సర్పంచ్ దురియా పుష్పలతతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామాలయం వీధి సిసి రోడ్డు పనులకు రూ.5 లక్షలు, ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ భవన రిపేరు, సిసి డ్రైన్లు కోసం మరో రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు చెప్పారు. అభివృద్ధి పనుల నిమిత్తం చింతపల్లి పంచాయతీకి గత నాలుగేళ్లలో సుమారు రూ.1.30 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చిందాడ జయలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యులు నాజర్ వల్లీ, వార్డు సభ్యులు బందారు నాయుడు, బుజ్జమ్మ, బందారు సత్యనారాయణ, గోకాడ సత్తిబాబు, జనసేన నాయకుడు దోనిబోయిన రవణ, ఎస్సీ కాలనీ యువత, మహిళలు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి-పెదబయలు : దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హరి హర పుత్ర మోటార్ యూనియన్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఎస్ పూర్ణయ్య ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు జి.సూరయ్య, టిడిపి నాయకులు, వార్డు సభ్యులు లోట్ల బుజ్జి, భక్తులు పాల్గొన్నారు.

దుర్గా దేవికి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి -పాడేరు: పట్టణంలోని గిరిలైసాస్ క్షేత్రం శివాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా ప్రతిష్ఠించిన దుర్గాదేవి మాతకు మంగళవారం దుర్గాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజరాజేశ్వరి దేవి ఆలయంలో కూడా మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. దుర్గాష్టమి సందర్భంగా ఆలయం వద్ద భవాని భక్తులు అంబలం పూజ పెద్ద ఎత్తున నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కనుల పండువగా సాగిన దీపారాధనలో పెద్దఎత్తున మహిళా భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొట్టగుళ్ళి సింహాచల నాయుడు, ప్రధాన కార్యదర్శులు ఉప్పల వెంకటరత్నం, కొట్టగుళ్ళి రామారావు తదితరులు పాల్గొన్నారు..

సహకార రుణాలపై అవగాహన

ప్రజాశక్తి- గొలుగొండ : మండలంలోని ఏడిగపల్లి పిఎసిఎస్ మహాజనసభ సర్వసభ్య సమావేశం చైర్మన్ భీమిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం జరిగింది.ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ రుణాలపై అవగాహన కల్పించారు. రైతులు పంట రుణవాయిదాలను సకాలంలో చెల్లించి ఆర్థిక ప్రయోజనం పొందడంతోపాటు సొసైటీ పురోభివృద్ధికి సహకరించాన్నారు.. రైతుల శ్రేయస్సు కోసం సొసైటీలు పని చేస్తాయన్నారు. ךఆర్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, ఎల్లవరం సర్పంచ్ రాంబాబు, సొసైటీ సెక్రెటరీ భీమిరెడ్డి వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు భీమిరెడ్డి రాంబాబు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-రంపచోడవరం: తుఫాను ప్రభావం కారణంగా ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణ్ రాజ్, రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభంనొక్వాల్ వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాబోయే మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందువల్ల ఏజెన్సీ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుఫాను కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లే ప్రమాదం ఉన్నందున, ఎట్టి పరిస్థితుల్లోనూ కాల్వలు వాగులు దాటకూ డదని హెచ్చరించారు. రెవెన్యూ యంత్రాంగాన్ని ముందుగానే అప్రమ త్తం చేశామని, కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు: మండలంలోని చింతలపూడి పంచాయతీ చింతలపూడిలో మంగళవారం మధ్యాహ్నం కొయ్యూరు ఎస్సై నాటు సారా విక్రయిస్తున్నారన్న సమాచారంపై, ఆడాకుల గ్రామానికి చెందిన యల్లంకి చిన్నఅప్పారావును అరెస్ట్ చేసి, అతని వద్ద ఉన్న 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ కిషోర్‌వర్మ తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- రాజవొమ్మంగి: నేడు రంపచోడవరంలో సిఐటియు ఆధ్వర్యంలో జరిగే భవననిర్మాణ కార్మికుల సంఘం రంపచోడవరం జిల్లా 1వ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.రామరాజు. తాపీమేస్త్రి సంఘం మండల అధ్యక్షులు సిగిరెడ్ల వీరబాబు, ఎలక్ట్రికల్ యూనియన్ నాయకులు రాంబాబు,భద్రం తదితరులు మంగళవారం పిలుపునిచ్చారు. వీరబాబు కరపత్రాలు పంపిణీ చేశారు. మహాసభకు మండలంలోని భవననిర్మాణ కార్మికులు అంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆందోళన చేస్తున్న ప్రభుత్వ వైద్యులు

సమస్యలు పరిష్కరించాలని వైద్యుల ఆందోళన

ప్రజాశక్తి - చింతూరు: తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వ వైద్యులు మంగళవారం చింతూరు ఐటిడిఎ కార్యాలయం ముందు వైద్యాధికారులు ఆందోళన చేపట్టారు. జిఒ 99 రద్దుచేసి డిపార్ట్‌మెంట్‌లో క్లినికల్ 30 శాతం, నాన్ క్లినికల్‌లో 50 శాతం సీట్లు కేటాయించాలని, ట్రైబల్ పిహెచ్‌సిలో పనిచేస్తున్న వైద్యులకు బేసిక్ అలవెన్సులు ఇవ్వాలని, నోటిఫికేషన్ ఎపి వివిలో టైం బాండ్ ప్రమోషన్స్ ఇవ్వాలి. 2020 బ్యాచ్‌కి ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పూరిల్లు దగ్ధం

దగ్ధమైన ఇల్లు

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలం లోని శ్రీరామగిరి పంచాయతీ పరిధిలోని చక్కనపల్లి కాలనీ రెడ్డిగుంపు గ్రామానికి చెందిన ముర్ల శిరీష ఇల్లు ప్రమాదవశాత్తూ దగ్ధమైంది. సోమవారం అర్ధరాత్రి ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ఇంటిలో వంట సామాగ్రి కాలిపోయాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. సిపిఎం, వైసిపి నాయకులు వారిని పరామర్శించారు. బాధితులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

కోతకు గురైన సత్యవరం-కొండకించంగి రోడ్డు

- మూడు పంచాయతీల ప్రజలకు రవాణా కష్టాలు

కోతకు గురైన సత్యవరం-కొండకించంగి రోడ్డు

ప్రజాశక్తి-చింతపల్లి

చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ సత్యవరం గ్రామం నుంచి జీకే వీధి మండలం జర్రెల పంచాయతీకి చెందిన కొండకించంగి గ్రామాన్ని కలుపుతూ ఉన్న లింక్ రహదారి సుమారు రెండు కిలోమీటర్ల మేర ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతింది. మట్టి రహదారి కావడంతో పలు చోట్ల భారీగా కోతకు గురై పెద్ద పెద్ద రాళ్లు బయటికి రావడంతో వాహనాలే కాకుండా పాదచారులు సైతం మా మార్గంలో రాకపోకలు సాగించలేని దుస్థితి నెలకొంది. ఈ రహదారి సత్యవరం ప్రజలతోపాటు జీకే వీధి మండలం జర్రెల, మొండిగెడ్డ, బలపం పంచాయతీ ప్రజలకు ప్రధాన ఆధారం. ఆంధ్ర-ఒడిశా సరిహద్దు ప్రాంత ప్రజలు కూడా తరచుగా ఈ మార్గాన్నే ఉపయోగిస్తారు. ముఖ్యంగా చింతపల్లి ప్రధాన ఆసుపత్రికి అత్యవసర రోగులను ఈ మార్గం ద్వారానే తరలిస్తూ ఉంటారు. ఈ రహదారి పూర్తి దెబ్బతినడంతో ఇప్పుడు పరిస్థితి అత్యంత క్లిష్టంగా మారింది. వృద్ధులు, గర్భిణీలు, విద్యార్థులు నడవడం కూడా ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాలకు వెళ్లే రైతులు కూడా బండరాళ్ల మధ్య దారిని వెతుక్కుంటూ నడవాల్సి వస్తోంది. వర్షాకాలం వచ్చినప్పుడల్లా ఇదే దుస్థితి. తాము ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా సరైన చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. తాత్కాలికంగా గోతులు పూడ్చడం కాకుండా శాశ్వతంగా తారు రహదారి నిర్మించాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. రవాణా సౌకర్యం లేక గర్భిణులు, అత్యవసర రోగులు ప్రాణాలు సైతం కోల్పోయే పరిస్థితులు నెలకొంటాయని గిరిజనులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల అష్టకష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రజాప్రతినిధులు, అల్లూరి జిల్లా ఉన్నతాధికారులు, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు వెంటనే స్పందించి తారు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని మూడు పంచాయతీలతో పాటు ఆంధ్ర-ఒడిశా ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికాయుతంగా సొసైటీ అభివృద్ధి

ప్రజాశక్తి - రావికమతం: ప్రణాళికాయుతంగా చర్యలు చేపట్టి, మేడివాడ పిఎసిఎస్‌ను అభివృద్ధిబాటలో నడిపిస్తానని సొసైటీ చైర్మన్ గూటాల చిన్న అన్నారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం మాట్లాడుతూ సొసైటీ పరిధిలో 2,771 మంది సభ్యులుండగా, రూ.8.47కోట్ల ఆర్థికలావాదేవీలు జరుగుతున్నాయన్నారు. రూ. కోటి వరకు మొండి బకాయిలుండగా, వాటి రికవరీకి ప్రత్యేక ప్రణాళిక చేస్తున్నట్లు తెలిపారు. సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత 60మందిని నూతన సభ్యులుగా చేర్చడంతోపాటు, రూ. 30 లక్షల రుణాలు రైతులకు అందించామన్నారు. సభ్యరైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా రుణాలను అందిస్తామని, సక్రమంగా వాటిని తిరిగి చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. గత పాలకవర్గం నిర్లక్ష్యం కారణంగా సొసైటీ అభివృద్ధిలో కుంటుపడిందని, సభ్యరైతులు, పాలకవర్గ సభ్యుల సహకారంతో తిరిగి గాడీలో పెడతామన్నారు. కార్యక్రమంలో కోపరేటివ్ సెక్రెటరీ జి. శ్రీనివాసరావు, డైరెక్టర్ నక్క వెంకటరావు, మేడివాడ సర్పంచ్ వజ్రపు శివ, టిడిపి పూర్వ అధ్యక్షుడు రాజనకొండ నాయుడు, మాజీ కోఆపరేటివ్ అధ్యక్షుడు శేషు, మాజీ ఎంపిటిసిలు రాంబాబు, బుజ్జి పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు వద్దు

-17వ రోజుకు చేరిన మత్స్యకారుల ఆందోళన
- రిలే దీక్షలకు వైసిపి నేతల సంఘీభావం

ప్రజాశక్తి -నక్కపల్లి : మత్స్యకారుల జీవన విధానాన్ని, ఈ ప్రాంత ప్రజా శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని బల్క్ డ్రగ్‌పార్కు ఏర్పాటును నిలుపుదల చేయాలని పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు మంగళవారం 17వ రోజుకు చేరుకున్నారు. దీక్షాశిబిరాన్ని సందర్శించిన మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల వైసిపి నాయకులు, ప్రజాప్రతినిధులు సంఘీభావం తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ మినీ కోనసీమగా ఉన్న నక్కపల్లిప్రాంతంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు వద్దన్నారు. ఇప్పటికే తీర ప్రాంతాల్లో రసాయన పరిశ్రమలు ఏర్పాటుతో మత్స్య సంపద నశించి, మత్స్యకారులకు ఉపాధి భారమైందన్నారు. సముద్రంలో చేపలవేటతో జీవనం సాగిస్తున్న మత్స్యకారుల ఉపాధిని దూరం చేయొద్దన్నారు. రెక్కాడితే గాని డొక్క నిండని మత్స్యకారులు 17 రోజులుగా పనులు మానేసుకుని, బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. సమస్య పరిష్కారమయ్యేవరకు మత్స్యకారులు ఆందోళన కొనసాగించాలని, తామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. మత్స్యకారుల దీక్షా శిబిరానికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డిని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యురాలు గోసుల కాసులమ్మ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, వైసిపి నాయకులు వీసం రామకృష్ణ, చిక్కాల రామారావు, శీరం నరసింహమూర్తి, దనిశెట్టి బాబూరావు, దగ్గుబిల్లి సాయిబాబా, చోడిపిల్లి శ్రీనివాసరావు, సురకాసుల గోవింద్, కోటేశ్వరరావు, పాపారావు, సత్యనారాయణ, బచ్చల రాజు, పల్లా చిన్నబ్బాయి, గోవింద్, బాబూరావు, మత్స్యకార నాయకులు ఎరిపిల్లి నాగేశ్వరరావు, పిక్కి తాతీలు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-వి.ఆర్ పురం: ఒకపక్క పోలవరం బ్యాక్‌వాటర్ మరోపక్క వరదలు రావడంతో మండలంలోని మూడు నుంచి నాలుగు నెలలుగా రహదారులు లేక, పంట పొలాలు పూర్తిగా ముంపునకు గురై రైతులందరూ తీవ్రంగా నష్టపోయారని ప్రజలు, కూలీలు పని లేక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తక్షణమే ప్రభుత్వం నిత్యావసర వస్తువులు పంపిణీ చేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం ఆధ్వర్యంలో విఆర్‌పురం మండలంలో స్థానిక తహశీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా పాలకులు పోలవరం ప్రాజెక్టు నిర్మించడంలో చూపే శ్రద్ధ నిర్వాసితులపై చూపించాలని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ అన్నారు. తక్షణమే నిర్వాసితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాసం కల్పించాలని లేదంటే పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సోయం చినబాబు, మండల నాయకులు కారం సుందరయ్య పంకు సత్తిబాబు, ఎంపిటిసి పూనేం ప్రదీప్‌కుమార్, పోడియం శ్రీరామ్మూర్తి, తుర్రం బాబురావు, సవలం మారయ్య సర్పంచ్, గుండెపుడి లక్ష్మణరావు, కమ్మ చిచ్చు సత్యనారాయణ, చిక్కాల రామారావు తదితరులు పాల్గొన్నారు

బతుకమ్మలు సిద్ధం చేసిన యువతులు

కట్టమైసమ్మ ఆలయంలో సద్దుల బతుకమ్మ

ప్రజాశక్తి- విఆర్‌పురం: మండలంలోని రేకపల్లి కట్ట మైసమ్మ అమ్మవారి సన్నిధిలో సద్దుల బతుకమ్మ వేడుకలు మంగళవారం అంగరంగ వైభవంగా జరిగాయి. అందంగా పేర్చిన బతుకమ్మలను మహిళలు కూడళ్లకు తీసుకువచ్చి గుంపులుగా చేరి పాటలతో, ఆటలతో హోరెత్తించారు. పండుగను ఉత్సాహంగా కొనసాగించారు. మహిళలు తమ ఇళ్లలో తయారు చేసిన బతుకమ్మల ను రంగుల పూలతో అలంకరించి తీసుకువచ్చారు. స్థానికులు భారీ ఎత్తున పాల్గొని ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువత, కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్టిసి రీజనల్ మేనేజర్ అప్పలనాయుడు

'స్త్రీ శక్తి'ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలి

ప్రజాశక్తి-విశాఖకలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకాన్ని మరింత సమర్ధంగా నిర్వహించాలని ఎపిఎస్ ఆర్టిసి రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం విశాఖజిల్లాలో ఉన్న వాల్తేరు,గాజువాక, స్టీల్ సిటీ, సింహాచలం, విశాఖపట్నం డిపోలలో ఆయన పర్యటించి సిబ్బందితో మాట్లాడారు. స్త్రీశక్తి పథకం నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ గంగాధర్, డిపో మేనేజర్లు సుధాకర్, సింహాచలం, శరత్‌బాబు, సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న ఐస్‌గెడ్డ అందాలు

దుప్పిలివాడ వద్ద జాలువారే ఐస్‌గెడ్డ జలపాతం

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు, దుప్పిలివాడ పరిసర ప్రాంతాల్లో భారీవర్షం కురవడంతో ఎత్తైన కొండలపై నుంచి జారువాలే ఐస్‌గెడ్డ జలపాతాలు పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన రహదారి పక్కనే ఇవి ఉండడంతో ఆకర్షిస్తున్నాయి. ఇదే రహదారిలో ఆంధ్రా ఒరిస్సా విశాఖ నుంచి వచ్చే పోయే ప్రయాణికులు ఐస్‌గెడ్డ జలపాతాలను చూసి ఎంతో అనుభూతిని పొందుతున్నారు.

నేరాలు ఘోరాలు

కత్తితో దాడి.. వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి –గోపాలపట్నం : వివాహేతర సంబంధం ఇద్దరి మధ్య వివాదానికి దారి తీసిన ఘటన గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధి గణపతినగర్‌లో చోటు చేసుకుంది. గోపాలపట్నం సిఐ సన్యాసినాయుడు కథనం ప్రకారం... జీవిఎంసి 89వ వార్డు పరిధి గణపతినగర్‌లో రైల్వేలో పనిచేస్తున్న ఓ మహిళ నివాసముంటుంది. ఈమెకు అదే సంస్థలో పనిచేస్తున్న గౌరునాయుడుతో వివాహేతర సంబంధం ఉంది. మరో వ్యక్తితో కూడా ఆమె వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. సెప్టెంబర్ 28వ తేదీన ఆమె ఇంటికి ఎప్పటిలాగే రెండో వ్యక్తి వచ్చాడు. తాను కాకుండా ఇంకెవరితోనే ఆమెకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో రాత్రి సుమారు 10 గంటల వరకు అక్కడే ఉండి తన ఇంటికి వెళ్లిపోతానని చెప్పి బయటకు వచ్చేశాడు. కానీ ఇంటికి వెళ్లకుండా ఆమె ఉంటున్న మేడపైన దాక్కొని ఉన్నాడు. కొంత సేపటి తర్వాత ఆమె ఇంటిలో నుంచి బయటికి వెళ్లి గౌరునాయుడును తీసుకొని స్కూటీ మీద ఇంటికి వచ్చింది. మేడ మీద నుంచి విషయాన్ని గమనించిన మొదటి వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించాడు. దీంతో ముగ్గురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వ్యక్తి పక్కనే ఉన్న చాకుతో గౌరునాయుడుపై దాడి చేసి గాయపరిచాడు. పక్కనే ఉన్న ఆమెకి స్వల్ప గాయాలయ్యాయి.

విజయనగరానికి చెందిన గౌరునాయుడు రైల్వేలో లోకో పైలట్‌గా పని చేస్తున్నాడు. అపరిచిత వ్యక్తి చాకుతో దాడి చేసి తన దగ్గర ఉన్న సెల్ ఫోను, బంగారు చైను ఇవ్వమని బెదిరించాడని గోపాలపట్నం పోలీస్ స్టేషన్లో గౌరునాయుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై గోపాలపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. గౌరు నాయుడు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పోలీసులు విచారించారు. ఆ విచారణలో పైన పేర్కొన్న వివాహేతర సంబంధం విషయాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడిని అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదుచేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ పరిధిలోని పిన్నింటి వారి కల్లాలు సమీపం తగరపువలస సర్వీస్ రోడ్డు పక్కన ఒక గుర్తు తెలియని వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెట్టుకు తాడు కట్టుకుని ఉరేసుకున్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెల్లంకి మహిళా పోలీసు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుని వయసు సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండి, ఆరెంజ్ రంగు షర్టు, గ్రే ప్యాంట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. మృతుని వివరాలు తెలియకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని భీమిలి ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సిఐ చింతా వాసునాయుడు ఆదేశాల మేరకు ఎస్ఐ గంట్యాడ సంతోష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూ పార్కులో రెండు సింహం కూనలు జననం

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాలలో రెండు సింహం కూనలు జన్మించాయి. జూ పార్కులో ఇప్పటివరకు రెండు సింహాలే ఉండగా అవి మరో రెండు కూనలకు జన్మనివ్వడం సంతోషంగా ఉందని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. అంతరించి పోతున్న వన్య ప్రాణుల జాబితాలో ఉన్న ఈ సింహాలు జూలో జననాన్ని ఇవ్వడంతో జూ సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పిల్లలు, తల్లి వైద్యుల సంరక్షణలో ఆరోగ్యంగా ఉన్నాయని మంగమ్మ తెలిపారు. ఈ పిల్లల పుట్టుక ప్రత్యేకమైన ప్రాముఖ్యతను కలిగి ఉందని, ఇవి ఆసియాటిక్ సింహం జాతికి చెందినవని పేర్కొన్నారు. ఆఫ్రికన్ సింహాలతో పోలిస్తే ఆసియాటిక్ సింహాలు కొద్దిగా చిన్నవిగా ఉంటాయని, వీటి పొట్ట భాగంలో ప్రత్యేకమైన మడత ఉంటుందని, గాంభీర్యమైన రూపం ఉంటుందని వివరించారు.

2 నుంచి వన్యప్రాణి వారోత్సవాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలలో ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు వన్యప్రాణి వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. యుకెన్, డబ్ల్యుసిటిఆర్ఇ, ధాన్ ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు, సందర్శకులకు బర్డ్ వాక్, చిత్రలేఖనం, వ్యాసరచన, ఎలక్యూషన్, ఫొటోగ్రఫీ తదితర పోటీలను నిర్వహించి, విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేయనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ 7893632900 నెంబరును సంప్రదించాలని సూచించారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా ఈ నెల 2 నుంచి 8వ తేదీ వరకు 12 ఏళ్ల లోపు చిన్నారులకు జూ ప్రవేశ రుసుం లేకుండా సందర్శించవచ్చని క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

కరెన్సీ నోట్లతో అలంకరించిన మహాలక్ష్మి అమ్మవారు

రూ.5 కోట్ల కరెన్సీ నోట్లతో మహాలక్ష్మి అలంకరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఓల్డ్‌టౌన్ కురుపాం మార్కెట్ ప్రాంతంలో పురాతన కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా తొమ్మిదో రోజైన మంగళవారం అమ్మవారిని శ్రీమహాలక్ష్మి రూపంలో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. దేవస్థాన సంఘ అధ్యక్షులు ఆరిశెట్టి దినకర్,కార్యదర్శి పెనుగొండ కామరాజు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో తెల్లవారుజామున అమ్మవారికి అభిషేకం చేసి 108 స్వర్ణపుష్పా లతో నివేదన చేశారు. ఈ సందర్భంగా ఆలయ గర్భగుడిలో సుమారు 6కిలోల స్వర్ణాభరణములు, బంగారు చీర, బంగారు కిరీటం, బంగారు పాదాలు, బంగారం బిస్కెట్లు, 10 కిలోల వెండి వస్తువులు, వెండి బిస్కెట్లతో పాటు రూ.5 కోట్లు విలువ చేసే కరెన్సీతో చేసిన అలంకరణ చూసి భక్తులు తన్మయత్వం చెందారు. ఉత్సవ కమిటీ చైర్మన్‌లు సురేష్‌కుమార్,సుగ్గ శివ, కంకటాల సతీష్ మాట్లాడుతూ గత 23 సంవత్సరాల నుంచి ఈ విధంగా అలంకరిస్తున్నామ న్నారు. సాయంత్రం బాలాత్రిపురసుందరి నత్యనికేతన్ వారిచే కూచిపూడి నృత్యప్రదర్శన నిర్వహించారు.

నవంబర్‌లో విశాఖలో సిఐఐ సదస్సు

- టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ వేదికగా నవంబర్‌లో సిఐఐ సదస్సు జరగనుందని, దీనికి అంతర్జాతీయ వ్యాపార దిగ్గజాలు హాజరు కానున్నారని టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ తెలిపారు. మంగళవారం సాయంత్రం టిడిపి కార్యాలయంలో గండి బాబ్జి అధ్యక్షతన టిడిపి కార్యకర్తలు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మరోసారి రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రానున్నాయని, సిఐఐ సదస్సు ఇందుకు దోహదపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం జిఎస్‌టి సంస్కరణలు చేయడంతో ప్రజలు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారో తెలియ జేయడానికి పార్టీ శ్రేణులను సన్నద్ధం చేయటం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్ పేరిట విశాఖలో ఈ నెల 26 నుంచి వచ్చే నెల19 వరకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, రాష్ట్ర వైద్యసేవ చైర్మన్, పార్టీ దక్షిణ ఇంచార్జ్ సీతంరాజు సుధాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోరాడ రాజబాబు, పెతకంశెట్టి మోహిత్ నరసింహ, విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు విల్లురి భాస్కరరావు,శరగడం రాజశేఖర్, జిల్లా కమిటీ నాయకులు పైల ముత్యాలనాయుడు, గొంప సత్యనారాయణ, విల్లూరి చక్రవర్తి,బొడ్డేటి మోహన్, అక్కిరెడ్డి జగదీష్, బర్ల బాలకృష్ణ, కోటనరేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు భద్రతపై అవగాహన

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : మత్స్యకారులకు సేఫ్టీ, ముందు జాగ్రత్తలు, స్మగ్లింగ్, హ్యూమన్ ట్రాఫికింగ్, సైబర్‌క్రైమ్ అంశాలపై ఫిషింగ్ హార్బర్‌లో మంగళవారం ఇండియన్ కోస్ట్‌గార్డ్ వారితో అవగాహన నిర్వహించారు. మత్స్యకారులందరికీ, ఇండియన్ కోస్ట్‌గార్డ్ టోల్‌ఫ్రీ నెంబర్ 1554 ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో కోస్ట్ గార్డ్, టూరిజం,స్థానికప్రజలు, కోస్టల్ సెక్యూరిటీ పోలీస్ పాల్గొన్నారు.